

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏసీసీ, ఫిబ్రవరి 7: మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా జరిగాయి. ఉదయం జనరల్ విభాగంలో 362 మంది విద్యార్థులకు 338 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 336 మంది విద్యార్థులకు 303 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 698 మందికి గానూ 57 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో జనరల్ విభాగంలో 220 మందికి 209, ఒకేషనల్ విభాగంలో 249 మందికి 235 మంది, మొత్తం 469 మందికి 444 మంది పరీక్షకు హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శైలజ తెలిపారు.

దివ్యాంగ పిల్లలకు చేయూతనివ్వాలి



విద్యార్థికి వినికిడి పరికరం అందజేస్తున్న డీఈవో యాదయ్య

ఏసీసీ, ఫిబ్రవరి 7: ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులైన బాల బాలికల అభివృద్ధి, వారి ఆరోగ్యం బాగు కోసం స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల పట్టణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో గుజరాత్‌కు చెందిన వి హియర్ ఇన్నోవేషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సహకారంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో వినికిడి లోపం కలిగిన విద్యార్థులకు బుధవారం పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి పరికరాలను డీఈవో చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్న 18 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించామన్నారు. శిబిరానికి హాజరైన 43 మంది బాల బాలికల్లో 33 మంది వినికిడి పరికరాలు పొందడానికి అర్హులైనందున వారికి పరికరాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి చౌదరి, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, సంస్థ ప్రతినిధులు సాహిల్, కులదీప్, రోహన్, సైన్స్ అధికారి మధుబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమ్మక్కకు ఎత్తు బంగారం



ఎత్తు బంగారం తూకం వేస్తున్న నల్లాల ఓదెలు కుటుంబీకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 7: సమ్మక్క సారక్క మొక్కులో భాగంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పట్టణంలోని మార్కెట్ ఏరియాలో బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఎత్తు బంగారం చెల్లించారు. అంతకు ముందు చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద తిరుమల్, పైడిమల్ల నర్సింగ్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఏసీసీ, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులు చేపడుతున్న నిరవధిక బుధవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు ఎడ్ల శ్రీనివాస్, కుంటాల శంకర్, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్ మాట్లాడారు. పవర్ ప్లాంటు మూసివేసి 15 నెలలు గడుస్తున్నా కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన క్లోజింగ్ బెనిఫిట్స్ చెల్లించకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. విధి లేని పరిస్థితుల్లో కార్మికులు దీక్ష చేపడుతున్నారని చెప్పారు. ప్లాంటు యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు దీక్షలో కార్మికులు శ్రీనివాస్, ఆనందరావు, సత్యం, రాజయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.



- 11వ తేదీ నుంచి మాఘ మాసం ప్రారంభం
- ఏప్రిల్ 26 వరకూ వివాహాల కోలాహలం
- మూడు నెలల్లో 30 ముహూర్తాలు
- ఆ తరువాత మూఢం, శూన్య మాసం
- తిరిగి శ్రావణ మాసంలోనే మంచి రోజులు
- ముందస్తుగా ఫంక్షన్ హాళ్ల బుకింగ్



ముహూర్తాల కాలం

మంచిర్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివాహాల కోలాహలం ఆరంభం కానుంది. ఈ నెల 11వ తేదీ నుంచి మాఘ మాసం ప్రారంభం అవుతుండగా వివాహాలకు అది ఎంతో శుభ ప్రదమైనది. మాఘ మాసంలో వివాహాలు జరిపించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. చాలా రోజుల తరువాత మంచి రోజులు వస్తుండడంతో పిల్లల పెళ్లిళ్లు చేసేందుకు తల్లిదండ్రులు ఆరాట పడు తున్నారు. మాఘ మాసం వసంత రుతువులో ప్రారంభం అవుతుంది. శీతాకాలం, వేసవి కాలం మధ్యలో వస్తున్నందున ఆ సమయం వివాహాలకు అత్యంత అనుకూలంగా ఉండటంతో పండితులు ఆ సమయంలోనే అధిక ముహూర్తాలు పెడుతుంటారు. ఈ ఏడాది అధిక మాసం కారణంగా ఇన్ని రోజులు ముహూర్తాలు లేకపోవడంతో అనేక మంది మాఘ మాసం కోసం వేచి చూస్తున్నారు.

ఉగాది వరకు..

మాఘ మాసం మొదలుకొని ఉగాది వరకు ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో 11వ తేదీ మొదలుకొని 14, 15, 16, 18, 19, 25, 26, 28, 29 వరకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు వేద పండితులు చెబుతున్నారు. అలాగే మార్చి నెలలో 2, 8, 13, 15, 16, 18, 27, 28, 29, 30, 31 వరకు మంచి ముహూర్తాలు ఉండగా, ఏప్రిల్‌లో 3, 4, 5 వరకు ముగుస్తుండగా, అనంతరం ఉగాది తరువాత మరిన్ని ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆయా తేదీల్లో వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభ కార్యాలు జరిపించేందుకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ తేదీల తరువాత ముహూర్తాలు ముగియనున్నాయి. మూఢం ప్రవేశించనుండగా. దాన్ని శూన్యమాసంగా పండితులు చెబుతున్నారు. పైగా శుభ కార్యాలు నిర్వహించేందుకు అది అనుకూల సమయం కావడంతో పై తేదీల్లోనే వివాహాలు జరిపించేలా పండితులు ముహూర్తాలు ఖరారు చేశారు. ఈ ముహూర్తాలు తప్పితే, తిరిగి శ్రావణ మాసం వరకు వేచి ఉండాల్సిందే. శ్రావణ మాసంలో మళ్లీ మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు స్పష్టం చేస్తున్నారు.

ఊపందుకున్న బుకింగులు...

ముహూర్తాలు ప్రారంభం కానుండడంతో వివాహాలు జరిపించే కుటుంబాలు ఫంక్షన్ హాళ్లను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లన్నీ నాలుగైదు నెలలు ముందుగానే బుక్ అయినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. రెండు నుంచి మూడు తేదీలు ఖరారు చేసుకుని, వాటి ఆధారంగా ఫంక్షన్ హాళ్లను ముందస్తుగా బుక్ చేసుకున్నారు. చాలా కాలం తరు వాత మంచి రోజులు వస్తుండడం, కేవలం 30 ముహూర్తాలే ఉండడంతో... ఇదే అదునుగా ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు కూడా రేట్లు పెంచి మరీ వసూలు చేస్తున్నారు. ఫంక్షన్ హాలు స్థాయిని బట్టి, పలు రకాల రేట్లలో అందుబాటులో ఉన్నాయి. ఫంక్షన్ హాళ్లతోపాటు బ్యాండ్ మేళాలు, డీజేలు, టెంట్ హౌజ్, క్యాటరింగ్, వెడ్డింగ్ కార్డుల ముద్రణ, తదితర ఏర్పాట్లలో ప్రజలు నిమగ్నమయ్యారు.

ఈ ఏడాది తక్కువే...

ఈ యేడాది వివాహ ముహూర్తాలు తక్కువగానే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. మాఘ మాసం ప్రారంభమవుతున్న ఈనెల 11వ తేది నుంచి శ్రీకోధ నామ సంవత్సర చైత్ర మాసం వరకూ అంటే ఏప్రిల్ 26వ తేదీ వరకు మూడు నెలల్లో కేవలం సుమారు 30 వివాహ ముహూర్తాలు మాత్రమే ఉన్నాయంటున్నారు. ఏప్రిల్ 28వ తేదీ నుంచి మూఢం ప్రారంభం కానుంది. దీంతో వైశాఖం, జ్యేష్ట మా సాల్లో వివాహ ముహూర్తాలు లేవని పంచాంగ కర్తలు వివరిస్తున్నారు. ఆ తరువాత ఆషాఢం శూన్య మాసం కావడంతో శుభ కార్యాలకు పనికి రాదని, మళ్లీ శ్రావణ మాసం అంటే ఆగస్టు నుంచి తిరిగి వివాహాలు జరిపించుకోవచ్చని పురోహితులు చెబుతున్నారు. సాధారణంగా ఏటా చైత్ర శుద్ధ నవమి అంటే శ్రీరామ నవమి అనంతరం వివాహాది శుభకార్యాలు ప్రారంభమవుతాయి. ఆ తరువాత వైశాఖ మాసం వేసవికాలం అయినప్పటికీ వివాహాలు ఎక్కువ గానే ఉన్నాయి. అయితే ఈ సారి వైశాఖ మాసం అంతా మూఢం కావడంతో వివాహాలన్నీ చైత్రం లో అంటే ఏప్రిల్ 26వ తేదీ లోపే జరిగే అవకాశం ఉంది.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

ఏసీసీ, ఫిబ్రవరి 7: ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాషతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పది సంవత్సరాల పాలన విజయాలను, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు కార్యకర్తలు సైనికుల్లా కష్టపడి పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. దేశ ప్రజలందరు మోదీ ప్రభుత్వం వైపు ఉన్నారని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థినకు గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోనె శ్యాంసుందర్‌రావు, నగునూరి వెంకటేశ్వర్, సునీల్‌రెడ్డి, సంధ్యారాణి, అశోక్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అడవులు, వన్యప్రాణుల రక్షణ

జన్నారం, ఫిబ్రవరి 7: ప్రజల భాగస్వామ్యంతోనే అడవుల, వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ అన్నారు. బుధవారం జన్నారం నర్సరీలోని కమ్యూనిటీ హాలులో ఉమ్మడి జిల్లా అటవీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్, మంచి ర్యాల డీఎఫ్‌వోలు, ఎఫ్‌డీవోలు, రేంజ్, డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్, బీట్ అధికారులు రామ్‌కిషన్ యాద వ్, వినయ్‌కుమార్ సాహూ, హఫీజోద్దీన్, నాగవత్ స్వా మి, గులాబ్ మొయినోద్దీన్, హేమలత, శంకర్, జ్ఞానేశ్వర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు పాటుపడాలి

హాజీపూర్, ఫిబ్రవరి 7: జిల్లాలో పార్టీ పటిష్టతకు పాటుపడాలని బీజేపీ సీనియర్ నాయకుడు అలజపూర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. గావ్ చలో (పల్లెకు పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు కేంద్ర పథకాలను వివరించారు. అనంతరం బీజేపీ కార్య కర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు జూపాక రాజేశ్వరి దర్మయ్య, నాయకులు మాధవరపు వెంకటరమణరావు, మున్నరా జసిసోడియా, ఆకుల అశోక్‌వర్ధన్, మల్లికార్జున్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

జైపూర్, ఫిబ్రవరి 7: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావే శం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కొరతను తీర్చడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో బాలయ్య పాల్గొన్నారు.

విద్యుత్ పనుల పరిశీలన

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని పాలవాగు ఒడ్డున అటవీ ప్రాంతంలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర పనులకు సంబంధించి బుధవారం విద్యుత్ ఏర్పాట్ల పనులను గుర్తింపు సంఘం నాయకులు పరిశీలించారు. భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు సంఘం బ్రాంచీ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ విద్యుత్ పనులను ఈ సందర్భంగా వారు ప్రారంభించారు.

గ్రామస్థులను భాగస్వామ్యం చేయాలి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 7: గ్రామాభివృద్ధిలో గ్రామస్థులను భాగస్వామ్యం చేయాలని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ కడారి జీవన్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారులు కేవలం బీఆర్ఎస్ నాయకులను మాత్రమే పిలుస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించడానికి గ్రామపెద్దలను, అన్ని పార్టీల నాయకులను పారిశుధ్య గ్రామసభలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు.

కుట్టు మిషన్లు పంపిణీ

జన్నారం, ఫిబ్రవరి 7: జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఎన్‌ఏసీ ద్వారా మూడు నెలల టైలరింగ్ శిక్షణ పొందిన 23 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లను ఖానాపూర్ ఎమ్మెల్యేవెడ్మ బొజ్జు చేతుల మీదుగా అందజేశారు. అలాగే గతంలో శిక్షణ పూర్తి చేసిన 43 మందికి ఎన్‌ఏసీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సహాయ కమిషనర్ వినీత, లేబర్ ఆఫీసర్ రామ్మోహన్, ఏడీ నాగేంద్ర, మండల కాంగ్రెస్ నాయకులు ముజాఫర్ ఆలీఖాన్, మేకల మాణిక్యం, రాజశేఖర్, ఇసాక్, కరుణాకర్, షాకీర్ ఆలీ, లక్ష్మీనారాయణ, సత్తయ్య,రమేష్, శ్రీనివాస్, శంకర్, రాజేష్, లక్ష్మీరాజ్యం, రాజలింగు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించాలి

- క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించాలి
- పారిశుధ్య గ్రామసభల్లో కలెక్టర్ బదావత్ సంతోష్



దేవాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కాసిపేట, ఫిబ్రవరి 7: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్, గట్రావుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య గ్రామసభల్లో కలెక్టర్ మాట్లాడారు. వేసవి సమీపిస్తున్న నేపధ్యంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత చేపడుతున్నప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించే విధంగా కృషి చేయాలని కోరారు. శానిటేషన్, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుని 8 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గట్రావుపల్లి గ్రామంలో గత 15 ఏళ్లుగా ఆరోగ్య ఉప కేంద్ర ప్రారంభా నికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉందని, దీన్ని అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. మిషన్ భగీరథ నీరు గ్రామాల్లోకి రావడం లేదని చేతి పంపులు చెడిపోయి తాగునీటికి ఇబ్బందిగా మారిందని కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే ఓరియంట్ కంపెనీ నుంచి వెలువడే దుమ్ము ధూళితో ఆరు గ్రామాల ప్రజలందరం ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. ఓరియంట్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, అర్హత ఉన్న వారికి కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దేవాపూర్‌లో జరిగిన గ్రామసభలో సైతం స్థానిక యువకులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ఓరియంట్ కంపెనీ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కంపెనీ అధికారులతో మాట్లాడి సమస్యపరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆలీం, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

హాజీపూర్: పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గుడిపేట గ్రామంలో ప్రత్యేక గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 15 వరకు నిర్వహించే పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి మల్లేష్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో తహసీల్దార్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నెన్నెల: గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని నందులపల్లిలో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. గ్రామంలో చేపట్టే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీవో నరేష్, గ్రామ కార్యదర్శి పద్మనాభం ఉన్నారు.

కన్నెపల్లి: గ్రామాల్లో చేపట్టనున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని రెబ్బెన గ్రామంలో పర్యటించారు. పారిశుధ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. జజ్జరవెల్లి గ్రామంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, కన్నెపల్లిలో ఎంపీడీవో రాధాకిషన్‌లు పారిశుధ్యంపై ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు.

చెన్నూరు: మండలంలోని ఆస్నాద, కిష్టంపేట తదితర గ్రామాల్లో బుధవారం ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఆస్నాద గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాస్ పారిశుధ్యపనులను, నర్సరీ పనులను పరిశీలించి సూచనలు చేశారు.

వేమనపల్లి: మండల కేంద్రంలో ఎంపీడీవో లక్ష్మయ్య, నీల్వాయి గ్రామంలో ఎంపీవో శ్రీపతిబాపురావు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు జడ్పీ సీఈవో నరేందర్ హాజరై మాట్లాడారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కోలి స్వర్ణలత, మాజీ సర్పంచు కుబిడె మధుకర్, ఈసీ మధు, టీఏ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు సిరాజ్, అశోక్ పాల్గొన్నారు.

భీమిని: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అధికారులు ఆధ్వర్యంలో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలను శుభ్రం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జవహర్‌లాల్, తహసీల్దార్ బికర్ణదాస్, ఎంపీవో సఫ్దార్ అలీ, గ్రామ పంచాయతీ సిబ్బంది, మాజీ సర్పంచులు, ఎంపిటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా బుధవారం నుంచి ప్రారంభమైన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టేందుకు మండలంలోని పంచాయతీల్లో అధికారులు పర్యటించారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్, ఏవో మహేందర్, పశువైద్యాధికారి పవన్‌కు మార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బద్రినాథ్ స్వామిలు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించారు. ఆల్గామ, జనగామ గ్రామాల్లో ఎంపీడీవో భాస్కర్ గ్రామసభలు నిర్వహించారు.

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు సమస్యలను గుర్తించారు. వెంకటాపూర్‌లో ప్రత్యేకాధికారి , ఎంపీవో బీరయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సారంగపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు మహిళలతో రంగోళి కార్యక్రమం నిర్వహించారు. వెంకటాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ వేల్పుల రవి, అందుగులపేటలో ఎంపీడీవో శశికళ, గ్రామాల్లో అధికారులు, సిబ్బంది పారిశుధ్య గ్రామసభలను నిర్వహించారు.

భీమారం: గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను ముమ్మరగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.అధికారులు సమస్యలు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



గుడిపేటలో మాట్లాడుతున్న జిల్లాపంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు



నెన్నెలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

విద్యార్థులకు సైన్స్ పోటీలు

ఏసీసీ, ఫిబ్రవరి 7: జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాల్లో భాగంగా బుధవారం మంచిర్యాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైన్స్ పోటీలు నిర్వహించారు. పెయింటింగ్, కవిత్వం, పాటలు పాడడం, ఉపన్యాసం విభాగాల్లో సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ , చెత్తను తగ్గించడం ,ఈ వ్యర్థాలను తగ్గించడం, సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ను నిషేధించడం,నీటిని పొదుపు చేయడం, శక్తిని కాపాడడం ఉప అంశాలుగా ఈ పోటీలు నిర్వహించారు. మంచిర్యాల జడ్పీహెచ్ ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని సాయిభార్గవి పాటలు పాడే అంశంలో, గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అఖిల కవిత్వం విభాగంలో, మంచిర్యాల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి వరుణ్‌తేజ ఉపన్యాస పోటీలో. కేజీబీవీ మంచిర్యాల విద్యార్థి అక్షిత పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఈ పోటీలను ఎంఈవో జాడి పోచయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.

దండేపల్లి: ఎమ్మార్సీ భవనంలో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సైన్స్ కవితలు, చిత్రలేఖనం, ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఎంబడి సునీత, నగేష్, నర్సయ్య, సురేందర్, రమేష్ వ్యవహ రించారు. జిల్లా స్థాయి పోటీలకు గుడిరేవుకు చెందిన అంజి(చిత్రలేఖనం), ద్వారకకు చెందిన శ్రీహిత(చిత్రలేఖనం), వెల్గనూర్‌కు చెందిన దీక్షిత(కవితలు), అలేఖ్య(పాటలు) ఎంపికయ్యారు.

కల్వర్టు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

జన్నారం, ఫిబ్రవరి 7: జన్నారంలోని రోహిత్ ఎలక్ట్రానిక్స్ ఎదుట కల్వర్టు నిర్మాణ పనులను బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహైల్ షా, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

కాసిపేట, ఫిబ్రవరి 7: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను సోమగూడెంలో బుధవారం కాంగ్రెస్ నాయ కులు దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ బాల్క సుమన్ వెంటనే సీఎంకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాపాట్ శంకర్, నాయకులు కృష్ణ, ప్రశాంత్, భూమయ్య, శేఖర్, పోచం, రాయలింగు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

కన్నెపల్లి, ఫిబ్రవరి 7 : లింగాల, మెట్‌పల్లి, నాయకునిపేట, కన్నెపల్లి, రెబ్బెన, జజ్జరవెల్లి, ముత్తాపూర్, జన్కాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాధవరపు నర్సింగరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

కన్నెపల్లి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు ఆర్ఐ కిషన్‌రావు తెలిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7: పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన కదాసి సత్యనారాయణ (51) అనే వ్యక్తి బుధవారం రైలు కింద పడి ఆత్మహత్యచేసుకున్నట్లు బెల్లంపల్లి రైల్వే పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసైన సత్యనారాయణ కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై కన్నాల ఫై ఓవర్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న రైలు పట్టాలపై తిరుపతి నుంచి హిస్సార్ వెళ్తున్న రైలు కింద ఆత్మహత్యచేసుకున్నట్లు తెలి పారు. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని తెలిపారు.

చోరీ చేసి పారిపోతున్న ఒకరి అరెస్టు

ఏసీసీ, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలో బుధవారం దోచుకున్న సొమ్ముతో ఆటోలో పారిపోతున్నదొంగను బెదిరించి డబ్బులు గుంజుకున్న ఘటన మంచిర్యాల చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని రాజురాకు చెందిన కాకట్ల కేశవరెడ్డి ఈ నెల 6న శ్రీరాంపూర్ వాటర్ ట్యాంకు ఏరియాకు చెందిన మంద భాస్కర్ ఇంట్లో రాత్రి దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ దొంగతనంలో లక్ష రూపాయలకు ఫైగా నగదును దోచుకుని బుధవారం శ్రీరాంపూర్ ఆటోలో మంచిర్యాలకు వస్తుండగా ఆటో డ్రైవర్‌తో పాటు మరికొందరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న అనంతరం కేశవరెడ్డిని బెదిరించి బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ. 51 వేల నగదు లభించింది. ఇంత డబ్బు ఎక్కడిదని బెదిరించి ఆ నగదులో నుంచి రూ. 31 వేలను శేఖర్ అనే వ్యక్తి బలవంతంగా లాక్కున్నాడు. ఈ క్రమంలో కేశవరెడ్డి, శేఖర్‌ల మధ్య వాగ్వాదం జరుగుతుండగా శేఖర్‌తో ఉన్న మరికొందరు డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని శేఖర్, కేశవరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. కేశవరెడ్డి దొంగతనం చేశాడని ఆటో డ్రైవర్లుచెప్పడంతో కేశవరెడ్డి వద్దరూ. 20 వేలు, శేఖర్ వద్ద రూ. 31 వేలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దర్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సింగరేణి డిపెండెంట్ నియామక పత్రాలు అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఏసీసీ, ఫిబ్రవరి 7: హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సింగరేణి డిపెండెంట్ ఉద్యోగుల నియామకపత్రాలను బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావులు డిపెండెంట్లకు అందజేశారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 441 మంది డిపెండెంట్లకు నియామకపత్రాలు అందజేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే వివేక్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకస్వామి బుధవారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో కలిశారు. ఆయన కొడుకు వంశీవివేక్‌తో కలిసి ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి మందమర్రిలో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలపై వివరించారు. వారి వెంట మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



బహుమతి అందజేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ

కాసిపేట, ఫిబ్రవరి 7: రఘుపతిరావు స్మారక వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజులుగా నిర్వహించిన పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో దేవాపూర్, తుడుంగూడ జట్లు తలపడ్డాయి. దేవాపూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ 5 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన తుడుంగూడ జట్టుకు 3 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. వేముల కృష్ణ మాట్లాడుతూ ఓడిన జట్టు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మల్లేష్, భీంరావు, నాయకులు కుమార్, కనకరాజు, రషీద్, జనార్ధన్, అచ్యుత్‌రావు, జయరాం, షాకీర్, షకీల్ పాల్గొన్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



స్వాగత్(ఫైల్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన పొలవేని స్వాగత్ (26) అనే యువకుడు ములుగు జిల్లా రామప్ప చెరువులో ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు. స్వాగత్ తన తండ్రి లక్ష్మణ్, తల్లి వాణి, సోదరుడు బానుతో కలిసి మంగళ వారం మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లాడు. అక్కడ మొక్కులు తీర్చుకొని తిరిగి ప్రయాణంలో రామప్ప ఆలయం కూడా సందర్శిం చడానికి వెళ్లారు. స్వాగత్ స్నేహితులతో కలిసి సాయంత్రం ఈతకు వెళ్లాడు. నీటిలో ఇరుక్కుపోవడంతో స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెస్క్యూ సిబ్బంది బుధవారం గాలించగా మృతదేహం లభించింది.

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి

నెన్నెల, ఫిబ్రవరి 7: సమస్యలు గుర్తించేందుకు అధికారులో క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి అన్నారు. నెన్నెలలో బుధవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్యలను వెంటనే పరిష్కరిచాలని సూచించారు. యాసంగి పనులు జోరుగా సాగుతున్నాయని, నాట్లు పూర్తి చేసుకున్న వారు తప్పకుండా పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆన్‌లైన్‌లో పంట నమోదై ఉంటే దిగుబడులు విక్రయించుకోవడంలో ఇబ్బందులు ఉండవని చెప్పారు. వేసవి కాలంలో ఉపాధిహామి పథకంలో కూలీలకు పనులు కల్పించనున్నట్లు ఏపీవో నరేష్ చెప్పారు. పనికోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే వారికి వంద రోజుల పని కల్పిస్తామన్నారు. విద్యా, వైద్యశాఖ, సెర్ప్, ఐసీడీఎస్, ఉపాధిహామి అధికారులు తమ త్రైమాసిక ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. 20 అంశాలపై అధికారులు సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో వరలక్ష్మి, జడ్పీటీసీ సింగతి శ్యామలారాం చదర్, ఉపాధ్యక్షురాలు సుమలత, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ ఇబ్రాహీం, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

భీమారం, ఫిబ్రవరి 7: మండలంలోని ఎల్కేశ్వరం రహదారి పక్కన గల కోళ్ల ఫారం సమీపంలో ఉన్న ఇసుక డంప్‌ను బుధవారం భీమారం మండల ఆర్‌ఐ స్రవంతి సీజ్ చేశారు. ఆర్‌ఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా 15 ట్రాక్టర్ల ఇసుకను ఈ ప్రాంతంలో డంప్ చేశారని తెలిపారు. తమకందిన సమాచారం మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీసులతో కలిసి వెళ్లి సీజ్ చేసినట్లు చెప్పారు. ఇసుకను మైనింగ్ అధికారులకు అప్పగించామని తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

హాజీపూర్, ఫిబ్రవరి 7: మండలంలోని దొనబండ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఇం గ్లీష్ సబ్జెక్టు పాఠశాలల సముదాయ సమావేశంలో ఇంగ్లీష్ భాషా ఉపాధ్యాయులు బుధవారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లును ఘనంగా శాలువాలతో సన్మానించారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులకు నూతన బోధన పద్ధతులపై ప్రతి నెలా అవ గాహన కల్పిస్తున్నందున ప్రధానోపాధ్యాయుడిని సన్మానించారు కార్యక్రమంలో సత్తయ్య, సంపత్, తిరుపతి, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, భీమారం, మందమర్రి మండలాల ఇంగ్లీష్ భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచులకు ఆత్మీయ వీడ్కోలు

నెన్నెల, ఫిబ్రవరి 7: మండలంలోని 19 గ్రామ పంచాయతీల సర్పంచులకు బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో సన్మానించారు. ఎంపీపీ సంతోషం రమాదేవి అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి సర్పంచులకు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సింగతి శ్యామలా రాంచందర్, ఎంపీడీవో వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు సుమలత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇబ్రాహీం, ఎంపీటీసీ తిరుపతి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు సాగర్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇందూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నాటు సారా విక్రయాలను అరికట్టాలి

చెన్నూరు, ఫిబ్రవరి 7 : మండలంలో నాటు సారా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వీటిని సంబంధిత అధికారులు అరికట్టాలని ఎంపీపీ బాపు కోరారు. చెన్నూరులోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మంత్రి బాపు అధ్యక్షతన నిర్వహించిన సాధారణ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో నాటుసారా అమ్మకాలు అరికట్టాలని కోరారు. నాటు సారా తయారు చేసే వారిని బైండోవర్ చేస్తున్నామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కాచన్‌పల్లి, కిష్టంపేట గ్రామాల్లో చెరువుల్లో పూడికలు తీయించాలని ఎంపీటీసీలు కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఇరిగేషన్ అధికారి తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని ఇందుకు అధికారులు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, ఎంపీటీసీలు పద్మ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అం కూస్, ఏపీఎం ప్రమీల, ఎంఈవో రాధాకృష్ణ మూర్తి, సీడీపీవో మనోరమ, హార్టీకల్చర్ అధికారి మహేందర్, వైద్యుడు కృష్ణతేజ, ఏపీఆర్ శివకుమార్, ఇరిగేషన్ ఏఈ చేతన్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో పార్టీ మారే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7: ప్రజాస్వామ్యంలో పార్టీ మారే హక్కు ఎవరికైనా ఉందని, తను ఇష్టపూర్వకంగా నేను బీఆర్ఎస్‌ను వీడీ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాను ఎవరికి కోవర్టుగా లేనని స్పష్టం చేశారు. అనవసరంగా కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వాపో యారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారం అందించడంతో తనపై కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టినా వీగిపోయిందని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని వివరించారు., కౌన్సిలర్ భర్త యూసుఫ్ చనిపోయిన సమయంలో కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు కౌన్సిలర్లు ఎవరు ముందుకు రాలేదని వివరించారు. కొందరు కౌన్సిలర్లు యూసుఫ్ సహాయార్థం జమ చేసిన డబ్బులను తాను వాడుకున్నానని ఆరోపణలు చేస్తున్నారని, ఇది నిజం కాదని తెలిపారు. కావాల్సుకుని కొందరు కౌన్సిలర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

ఘనంగా మాతా రమాబాయి జయంతి



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7: జిల్లాకేంద్రంలో జైభీం సేన ఆధ్వర్యంలో మాతా రమాబాయి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్‌చౌక్‌లో ఆమెచిత్రపటానికి పూల మాలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు వినోద్, అశోక్, సుధాకర్, చరణ్‌దాస్, కృష్ణాజీ, పెంటయ్య, సాంబయ్య, అజిత్, అనిల్ పాల్గొన్నారు.

వాంకిడి: మండలకేంద్రంలోని జైత్వాన్ బుద్ధవిహర్‌లో అంబేద్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో మాతా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, జయరాం, సునీల్‌కుమార్, దుర్గాజీ, శ్యాంరావు, విజయ్, విలాస్, విఠల్,రోషన్, బలవంతరావు, ప్రతాప్‌తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో జైభీం యూత్ ఆధ్వర్యంలో మాతా రమాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు దుర్యోధన్, హోక్షు, ప్రకాష్, జనార్ధన్, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో మాతారమాబాయి విగ్రహానికి దళితులు, గిరిజనులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంబ్లే అన్నారావు, నాగోరావ్, గాయక్వాడ్ సతీష్, వాగ్మారె ఘట్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

కౌటాల, ఫిబ్రవరి 7: మండలకేంద్రంలో బుధవారం ప్రత్యేకాధికారి సురేందర్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. డీఆర్‌పీడీ సురేందర్, ఎంపీపీవిశ్వనాథ్, ఎంపీడీవో నస్రుల్లా ఖాన్‌తో కలిసి పంచాయతీ కార్యాలయం నుంచి జడ్పీఎస్ఎస్, బస్టాండ్, ప్రధాన రోడ్లను ఆయన పరిశీలించారు. ఎక్కడ కూడా మురికి నీరు నిలువ ఉండకుండా చూడాలని, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు.

దహెగాం:మండలంలోని గ్రామపంచాయతీల్లో పకడ్బందీగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని ఐనం, కల్వాడగ్రామాల్లో పారిశుధ్యపనులు పరిశీలించారు.కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

బెజ్జూరు: పారిశుధ్యంపై ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నామని గ్రామప్రత్యేకాధికారి వెంకటేష్ అన్నారు. బుధవారం వీధుల్లో పర్యటించారు. రోడ్లపై చెత్తలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా, కార్యదర్శి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

వీజీ సెట్‌కు ఏర్పాట్లు పూర్తి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 7: ఈనెల11న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్ష(వీజీ సెట్)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీవో బాలరాజు తెలిపారు. జిల్లాలో 9సెంటర్లు ఎంపిక చేశామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని దిందా నుంచి బస్సు వెళ్లడానికి రోడ్డు బాగా లేకపోవడంతో బుధవారం గ్రామస్థులు శ్రమదానంతో మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు మా ఓట్లు కావాలని కానీ అభివృద్ధి మాత్రం చేయరని అన్నారు. రోడ్డు మంజూరు అయిన సర్వే చేసి తక్కువ బడ్జెట్ ఉందని నిధులను వెనక్కి పంపారని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామస్థులు నారాయణ, ఎమ్మాజీ, రాకేష్, రుషి, అర్జున్, మల్లేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7: కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని ఢిల్లీలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్-రాయ్‌పూర్ కారిడార్‌లోని బెల్లంపల్లి-గడ్చిరోలి జాతీయ రహదారి మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం దారుణం

రెబ్బెన, ఫిబ్రవరి 7: మండల బీఆర్ఎస్ నాయకుడు మధునయ్య, నకిలీ విలేకరి దందా చేస్తూ ప్రభుత్వ భూమిని కబ్జా చేయటం దారుణమని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఎల్ రమేష్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగాపూర్ గ్రామానికి చెందిన పందిర్ల మధునయ్య భార్య వినోద2019లో సర్పంచిగా ఎన్నికైనట్లు తెలిపారు. మధునయ్య బీఆర్ఎస్‌పార్టీలో క్రియాశీలక సభ్యత్వం పొంది, గత ప్రభుత్వ హయాంలో జాతీయరహదారి పక్కన ఉన్న సర్వేనెంబరు 342/1ను కబ్జా చేయటం కోసం నకిలీ విలేకరిగా అవతారం ఎత్తినట్లు తెలిపారు. ప్రెస్‌క్లబ్ కూల్చివేతలోకూడా ఆయన హస్తం ఉన్న ట్లు తెలిపారు. ఆందోళనలు చేసినా ఎవరూ కూడా పట్టించుకోలేదన్నారు. దీంతో రెచ్చిపోయి ఏకంగా ప్రెస్‌క్లబ్ పక్కనున్న స్థలాన్ని కబ్జా చేసిన్నట్లు వివరించారు. ఇలా నకిలీ విలేకరిగా అవతారం ఎత్తి భూ దందాలను ఇష్టారాజ్యంగా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు, అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో పోరుబాటతప్పదని తెలిపారు.

సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మాజీజడ్పీటీసీ దుర్గం సోమయ్య, గంగాపూర్ మాజీసర్పంచి ఎల్ గంటుమేర తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలి

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 7: మండలంలోని చింతగూడ గ్రామపంచాయతీ పరిధిలోగల బలగల గ్రామసమీపంలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల సమీపంలో ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు బుధవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. డంపింగ్‌యార్డు వలన పక్కనే ఉన్న రెండు పాఠశాలల విద్యార్థులు తీవ్రఅస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామ సమీపంలో ఉన్న ఈ పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 1000మంది విద్యార్థులున్నారని అన్నారు. డంపింగ్‌యార్డులోని చెత్తకు నిప్పంటించడం వలన దుర్వాసన, పొగతో నిత్యం అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే డంపింగ్ యార్డును తొలగించాలని వారువినతి పత్రంలో కోరారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని కమిషనర్ హామీఇచ్చినట్లు వారు తెలిపారు. వినతి పత్రం ఇచ్చినవారిలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు అథర్‌అలీ, ముజమీలుద్దీన్, అజీం, అఖిల్, శంషాద్, సతీష్, నషీద్, శివ, ఫిరోజ్ ఉన్నారు.

రోడ్డుపైనే ఎస్పీఎం లారీలు

● ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు



బాలభారతి పాఠశాల సమీపంలో రోడ్డుపై నిలిపిన లారీలు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7: కాగజ్‌నగర్ ఎస్పీఎంకు వచ్చే కర్ర లారీలతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్కర్స్ గేటు సమీపంలోని లోడింగ్ పాయింట్ నుంచి మిల్లులోకి ఒక్కొక్క లారీని లోనికి పంపిస్తారు. బుధవారం కర్రలోడ్‌తో ఎక్కువలారీలు రావటంతో ఎస్పీఎం లోడింగ్ పాయింట్ నుంచి అరకిలోమీటరు దూరంలో ఉన్న హనుమాన్ ఆలయం వరకు లారీలు నిలిచిపోయాయి.లారీలన్నీ రోడ్డుపైనేనిలపడంతో మిగతా వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుపై లారీలు నిలపకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో విచారణ

హాజీపూర్, ఫిబ్రవరి 7: మండలంలోని ముల్కల్ల సాంఘిక సంక్షేమగురుకుల పాఠశాలలో పురుగుల అన్నం పెడుతున్నారని తల్లిదండ్రులు మంగళ వారం ఆందోళన చేపట్టగా బుధవారం గురుకులాల ఆర్‌సీవో స్వరూపరాణి పాఠశాలలో విచారణ చేపట్టారు. పురుగుల అన్నం ఎందుకు పెట్టారని ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం బస్తాలో పురుగులు ఉన్నాయని ఒక్కరోజు మాత్రమే అలా జరిగిందని తెలిపారు. ఉన్న బియ్యం బస్తాలను వెనక్కి పంపించి వేరే బియ్యం బస్తాలను తెప్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఆర్‌సీవో ఆగ్రహం వ్యక్తం చేస్తూ మొదటి తప్పుగా భావించి మెమోలు జారీ చేస్తున్నానని, పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటా యని హెచ్చరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేశారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

హాజీపూర్, ఫిబ్రవరి 7: ముల్కల్లలోని తెలంగాణ సాంఘిక సంక్షేమగురుకుల పాఠశాల విద్యార్థులకు పురుగుల ఆహారం పెడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి జన సమితి నాయకులు బుధవారం గురుకులాల ఆర్‌సీవోకు వినతి పత్రం అందించారు. నాయకులు ప్రవీణ్‌కుమార్,షేక్ సల్మాన్‌పా షా, జుమ్మిడి గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సరైన ఆహారం అందించడం లేదని, విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్‌నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

మల్లు రవిని కలిసిన నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 7 : సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (140/2018) ప్రధాన కార్యదర్శి అంతోటినాగేశ్వర రావు ఆధ్వర్యంలో ఢిల్లీలో ఉన్న తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవిని కలిశారు. సింగరేణికి చెందిన వికె7 ఓసీపీ, జీకే ఓసీపీ, రొంపేడు ఓసీపీలకు ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించి గనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. అందుకు ఆయన అంగీకరించారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు ఎంవీరావు, కోశాధికారి జిమ్మిడి మల్లేష్, కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాజీపేట కృష్ణ, అన్ని ఏరియాల ఉపాధ్యక్షులు ప్రవీణ్, కుమారస్వామి, రామారావు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

జన్నారం, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం విజయవాడ 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ బీటెన్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరాణి, ఆర్ఐ భానుచందర్, హెడ్ కానిస్టేబుల్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను బుధవారం ఆర్డీవో హరికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఇంటి నిర్మాణాలు చేపడితే సహించేది లేదని చెప్పారు.. ప్రభుత్వ భూముల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు కూలీలు, మేస్త్రీలు వెళ్లకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్: దేశవ్యాప్తంగా ఈనెల16న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. బుధవారం ఏఐటీ యూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

ఆసిఫాబాద్ రూరల్: ఆసిఫాబాద్‌సీఐగా గదిగొప్పుల సతీష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అయనమాట్లాడుతూ శాంతిభద్రతల పరిర క్షణకు తనవంతు కృషిచేస్తానని ప్రజలు సహకరించాలని కోరారు.

రెబ్బెన: రెబ్బెన సీఐగా ఎన్ చిట్టిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల కోసం అంతా సహకరించాలని కోరారు.

సిర్పూర్(యు): స్వయంఉపాధిలో యువత రాణించాలని డీసీసీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కుడ్మేత విశ్వనాథ్‌రావు, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్ రావుఅన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన జ్యూస్‌సెంటర్ ఆయన ప్రారంభించారు.

-రాష్ట్రదేవదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో మంగళవారం మండల వీటీడీఏ చైర్మన్ కుమ్రభీంరావు బండేయేర్‌లో నిర్మిస్తున్న ఆలయానికి నిధులు మంజూరుచేయాలని వినతిపత్రం సమర్పిం చారు. దీనికిమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

దహెగాం: మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో బుధవారం ఆరె సంక్షేమసంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, ఉపాధ్యక్షులుగా మల్లేష్, ప్రశాంత్, కోశాధికారిగా సత్యనారాయణను ఎన్నుకున్నారు.

-జాతీయ ఉపాధిహామీపథకంలో పనిదినాలు పెంచాలని పేదరిక నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శణ్ కోరారు. బుధవారం మండలకేంద్రంలో పాదయాత్రలో భాగంగా ఆయన మాట్లాడారు. పేదలకు కేజీటుపీజీవరకు ఉచితవిద్య అందించాలని, చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

-మండలంలోని బీబ్రా ఉన్నతపాఠశాలలో బుధవారం పదవతరగతి విద్యార్థులకు పుప్పాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు.

సిర్పూర్(టి): మండలంలో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందంసభ్యులు బాపు, మోహన్ నాయక్, సోమశేఖర్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట/తిర్యాణి: పెంచికలపేట, తిర్యాణి మండలాల్లో అయిదు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న కమ్మర్‌గాం, మురళీగూడ, కన్నెపల్లి గ్రామ సర్పంచ్‌లు మధునయ్య, ఈశ్వరిబాయిని, మమత, పాలకవర్గ సభ్యులను అటవీశాఖాధికారులు, సహకార సంఘ చైర్మన్ శ్రీనివాస్ బుధవారం ఘనంగా సన్మానించారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో ఈ నెల 21న జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు. చిరుదుకాణాలను కోసం ఏర్పాటు చేస్తున్నారు.

-మద్యపానం నిషేదించాలని చింతగూడ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ కిరణ్‌కు జాడిదీపక్ బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్యపానంతో అనారోగ్యం పాలవుతున్నారని, ఈ ప్రాంతంలో మద్యం కల్తీ అధికంగా జరుగుతోందని తెలిపారు. వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

పెంచికలపేట: ప్రతిగ్రామం గుడుంబా రహిత గ్రామంగా మారాలని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగుంట గ్రామంలో పోలీసులు మీ కోసంలో భాగంగా పది మంది నిరుపేదలకు 1.50క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గుడుంబా, పేకాట, మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు.

'వేకువ'ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

పెంచికలపేట, ఫిబ్రవరి 7: మండలం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లీడ్ఇండియా ఆర్గనైజేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ ఆచార్య, తిరుపతి ప్రేరణ పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మెమోరీ టిప్స్, సమయపాలన, ఏకాగ్రత, జీవిత లక్ష్యాలు ఏర్పర్చుకోవడం, మానవవిలువలు తదితర విషయాలపై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు రాలు విజయనిర్మల, ఫౌండేషన్ ప్రతినిధులు శంకరయ్య, ప్రేరణవక్తలు శ్రీనివాస్,తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



పాఠశాలను తనిఖీచేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

వాంకిడి, ఫిబ్రవరి 7: మండలంలోని ఖిరిడి గ్రామ పంచాయతీ పరిధిలోని లింబుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలను బుధవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే తనిఖీచేశారు. పాఠశాలలో పనిచేస్తున్న చందు అనే ఉపాధ్యాయుడు రోడ్డుప్రమాదంలో గాయాలు కావడంతో సెలవుపై ఉన్నాడు. అతని స్థానంలో ఖైరి(టి) పాఠశాలలో పనిచేస్తున్న సుధాకర్ అనే ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా పంపించారు. అతను విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో పాఠశాలను తనిఖీచేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం, పాఠశాల అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులు వస్తున్నారా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు గైర్హాజరు ఎందుకు అవుతున్నారో ఎస్సీఆర్పీ, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎంలను సంజాయిషీ కోసం నోటీసు జారీ చేయాలని డీడీడబ్ల్యూటీ రమాదేవిని ఆదేశించారు.

ఖిరిడి గ్రామ సమస్యలు పరిష్కరించాలి..

మండలంలోని ఖిరిడి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. బుధవారం గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. మన ఊరు మన బడి పనులు పూర్తి చేయాలని, పాఠశాలకు ఆనుకుని ఉన్న ఒర్రె నీరు పాఠశాలలోకి వస్తున్నాయని, కల్వర్టు నిర్మించాలని, కొత్త పంచాయతీభవనాన్ని పూర్తి చేయాలని కోరారు.

నేడు ఓటరు జాబితా పరిశీలకుల సమావేశం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఈ నెల8న ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులుగా నియమించబడిన ప్రత్యేకాధికారి బి భారతిలక్‌పతి నాయక్‌తో సమావేశం ఉంటుందని కలెక్టర్ హేమంత్‌బోర్కడే తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్, బూత్‌లెవల్ అధికారులు హాజరు కావాలన్నారు.

చిన్నారుల జీవితాల్లో వెలుగులు

- డ్రాప్ అవుట్, బాల కార్మికుల విముక్తి
- ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌ల ద్వారా గుర్తింపు
- ఏడాదికి రెండుసార్లు తనిఖీలు
- ఏడేళ్లలో 996మంది బాలల గుర్తింపు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7: ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు బాలకార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. వివిధ కారణాలతో చదువు మానేసి.. కార్మికులుగా మారిన బాలలను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించడంతోపాటు మంచి భవిష్యత్ అందిస్తున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఇటుక బట్టీలు, బట్టల దుకాణాలు, బైక్ మెకానిక్‌ల వద్ద పనులు చేస్తున్న బాలకార్మికులను గుర్తించేందుకు ప్రభుత్వం 2014లో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మహిళాశిశు సంక్షేమ శాఖ, పోలీస్, కార్మిక, బాలల సంరక్షణ విభాగం అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేసి, ఎక్కడైనా 18 ఏళ్లలోపు బాలలు పనులు చేస్తూ కనిపి స్తే వారికి విముక్తి కల్పిస్తున్నారు. వారి పరిస్థితులకు అణుగుణంగా సమీపంలోని పాఠశాలల్లో చేర్పించి, చదువుకునేలా పోత్సహిస్తున్నారు. గుర్తించిన బాలలను విధిగా పాఠశాలలకు పంపించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు వారిని చదివించే విధంగా సూచనలు చేస్తున్నారు.



ఆసిఫాబాద్‌లో గుర్తించిన బడిబయట పిల్లలతో అధికారులు (ఫైల్)

996మందికి విముక్తి..

జిల్లాలో గడిచిన ఏడేళ్లలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా 996మంది బాలలకు వెట్టినుంచి విముక్తి లభించింది. 2014లో ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా 2016లో జిల్లా ఏర్పడటంతో 2017నుంచి జిల్లాలో ప్రతిఏటా జనవరి, జూలై మాసాలలో ఆయాశాఖల అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.

2017 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 996మంది బాల కార్మికులను గుర్తించి వారిని సమీప పాఠశాలల్లో చేర్పించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. 2017ఆపరేషన్ స్మైల్‌లో 58మంది బాలురు, తొమ్మిది మంది బాలికలు, 2017 ఆపరేషన్ ముస్కాన్‌లో 23మంది బాలురు, ఇద్దరు బాలికలు, 2018 ఆపరేషన్ స్మైల్‌లో 40మంది బాలురు, ఏడుగురు బాలికలు, ఆపరేషన్ ముస్కాన్‌లో 28మంది బాలురు, ముగ్గురు బాలికలు, 2019ఆపరేషన్ స్మైల్ లో 48మంది బాలురు, 18మంది బాలికలు, ఆపరేషన్ ముస్కాన్‌లో 53 మంది బాలురు, 10మంది బాలికలు, 2020ఆపరేషన్ స్మైల్‌లో 100మంది బాలురు, ఆరుగురు బాలికలు, 2021ఆపరేషన్ స్మైల్‌లో 139మంది బాలురు, 18మంది బాలికలు, ఆపరేషన్ ముస్కాన్‌లో 128మంది బాలురు, 12మంది బాలికలు, 2022 ఆపరేషన్ స్మైల్‌లో 92మంది బాలురు, తొమ్మిది మంది బాలికలు, ఆపరేషన్ ముస్కాన్‌లో 48మంది బాలురు, నలుగురు బాలికలు, 2023ఆపరేషన్ స్మైల్‌లో 42మంది బాలురు, ఒకబాలిక, ఆపరేషన్ ముస్కాన్‌లో 30మంది బాలురు, 2024ఆపరేషన్ స్మైల్‌లో 63మంది బాలురు, ఐదుగురు బాలికలకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై లేబర్ ఆక్ట్ కింద కేసులు నమోదు చేశారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలు చదువుకునేందుకు ఆవకాశం కల్పిస్తున్నారు.

బాలలతో పనిచేయిస్తే కఠినచర్యలు..

మహేష్, జిల్లా బాలల సంరక్షణాధికారి



18ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించడం నేరం. ఎట్టి పరిస్థితుల్లోనూ బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదు. పనిలో పెట్టుకున్నట్లయితే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తాం. ప్రతి ఏటా రెండు సార్లు తనిఖీలు నిర్వహించి బడిబయట పిల్లలను గుర్తిస్తున్నాం. బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి గుర్తించిన బాలకార్మికులను సమీప పాఠశాలల్లో చేర్పిస్తున్నాం. జిల్లాలో ఇప్పటివరకు 996 బాలలను గుర్తించి వారిని వెట్టి చాకిరి నుంచి విముక్తి చేశాం. బాల్యం ను బందీ చేయడానికి ఎవరు ప్రయ త్నించినా ప్రభుత్వం వారిపై కఠినచర్యలు తీసుకుంటుంది. బాల్యవివాహాలు చేయడం చట్టరిత్యానేరం. బాల్యంవివాహం చేసే వధూవరుల తల్లిదండ్రుల పైనే కాకుండా ప్రోత్సహించిన వారిపై కూడా కేసులు నమోదుచేస్తాం.



పారిశుధ్యంపై దృష్టిసారించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

రెబ్బెన, ఫిబ్రవరి 7: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం రెబ్బెన, గోలేటి, సోనాపూర్ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పారిశుధ్యంపై ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సౌందర్య, జడ్పీటీసీ సభ్యుడు సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీవాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- 15మందిపై కేసునమోదు
- రూ.41,740నగదు స్వాధీనం



పట్టుబడిన పేకాట రాయుళ్లతో పోలీసులు

బెజ్జూరు, ఫిబ్రవరి 7: కోడిపందెం నిర్వహిస్తున్న స్థావరంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మండలంలోని మద్దిగూడ గ్రామసమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేయగా రూ.41,740 నగదు, నాలుగు కోళ్లు, అయిదు ద్విచక్ర వాహనాలు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. కోడిపందెంలు ఆడుతున్న వివిధ గ్రామాలకు చెందిన 15మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో కోడిపందెంలు నిర్వహిం చినా, ఆడినా కఠినచర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మధు, చంద్రశేఖర్, మహేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7: సీసీఐ ద్వారా పత్తికొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారికి బీసీ యువ జనసంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఎక్కువశాతం మంది రైతులు పత్తి పంటపైనే ఆధార పడి జీవిస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు 70శాతం మంది రైతులు తమపత్తిని అమ్మినప్పటికీ మిగితా రైతులు ఇప్పుడి ప్పుడే జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి సీసీఐ ద్వారా పత్తికొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారుతి, ప్రశాంత్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్థానికులకు అవకాశం కల్పించాలి..

జిల్లా వైద్యఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బంది నియామకాల్లో స్థానికేతరులను నియమించారని పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్హులైన స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పించాలని బుధవారం అదనపుకలెక్టర్ దీపక్ తివారికి డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కార్తీక్, సరోజ, మౌనిక, ప్రమీల, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పట్టుగూళ్ల వేలం నిర్వహించిన అధికారులు

కౌటాల, ఫిబ్రవరి 7: మండలంలోని తలోడి పట్టు పరిశ్రమ పరిధిలో రైతులు పండించిన పట్టుగూళ్ల(కాయల)ను బుధవారం అధికారులు వేలం వేశారు. కర్జవెల్లిరేంజ్ అటవీప్రాంతంలోని అంబగట్టు, కాటేపల్లి, ముంజంపల్లి గ్రామ రైతులు అటవీప్రాంతంలోని నల్లమద్ది చెట్లపై ఈ పట్టుగూళ్లను పెంచినట్లు వరంగల్ జేడీఎస్ జి అనసూయ తెలిపారు. మొత్తం182మంది రైతులు కలిసి 10.62లక్షల పట్టుగూళ్లను పండించినట్లు ఆమె తెలిపారు. గత సంవత్సరం 5 లక్షల గూళ్లను పండించగా ఈ ఏడాది వేలంపాటలో చత్తీస్‌గఢ్, జార్ఖండ్, హకీంపేట, పోతిరెడ్డిపల్లి కోఆపరేటివ్‌కు చెందినవ్యాపారులు వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. వెయ్యి గూళ్లకు గాను రూ.5100లకు వేలం పాటలో వ్యాపారులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆసక్తిగల రైతులకు ఈ పట్టు సాగుపై అవ గాహ న కల్పించి వారికి కావాల్సిన ప్రోత్సాహాన్ని అందించ నున్నట్లు తెలిపారు. ఈవేలం పాటలో డీహెచ్ఎస్‌వో వెంకటేశం, శాస్త్రవేత్త భగవాన్, ఏడీ దయాకర్, ఏడీ పార్వతి, హార్టికల్చర్ అధికారిణి శాంతి ప్రియదర్శిణి, వెంకన్న, ఎండీ బయుద్దీన్, సోము,శంకర్, నరయ్య తదితరులు పాల్గొన్నారు.



పట్టుగూళ్లకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

ప్రపంచ అథ్లెటిక్స్ లెవల్-2 కోర్సుకి ఎంపికైన పీడీ



ఎం విద్యాసాగర్

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 7: ఆసిఫాబాద్ ఆదర్శ గిరిజన క్రీడాపాఠశాలలో అథ్లెటిక్‌శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎంవిద్యాసాగర్ ఈనెల 9నుంచి 5వరకు కేరళలోని త్రివేండ్రంలో ప్రపంచ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అథ్లెటిక్స్ లెవల్-2 కోర్సుకి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఆయనను గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, సారంగపాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, కోట్నాక విజయ్, శంకర్, మారయ్య, లక్ష్మణ్, అరవింద్, తిరుమల్ తదితరులు అభినందించారు.

మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన మహిళలు, సామాజిక ఆర్థిక సాధికారత రంగాల్లో అసాధారణమైన పరిస్థితుల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను రాష్ట్రఅవార్డుతో సత్కరించేం దుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖాధికారిణి సావిత్రి ఒకప్రకటనలో తెలిపారు. మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం రోజున అవార్డులు ప్రదానం చేస్తామ న్నారు. స్త్రీశిశు సంక్షేమ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ కమిషన్, అమీర్‌పేట, హైదరాబాద్‌కు దరఖాస్తుప్రతిని ఈ-మెయిల్ ద్వారా పంపించాలన్నారు.

బాలికలు, మహిళల భద్రతే షీటీం లక్ష్యం

వాంకిడి, ఫిబ్రవరి 7: బాలికలు, మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని వాంకిడి సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బెండార డిగ్రీ కాలేజీలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో సైబర్ క్రైంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకతాయిలు బాలికలను భయాందోళన గురిచేసినా, వేధించినా ఇబ్బందికరంగా మాట్లాడినా వెంటనే 100లేదా 8712670564ను సంప్రదించాలన్నారు. అనుకోకుండా బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బులు పోతే 1930 టోల్‌ఫ్రీనంబర్‌ను సంప్రదిస్తే ఫ్రీజ్ చేస్తామన్నారు. తరువాత పోలీసులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో షీటీం ఇన్‌చార్జీ సునీత, సభ్యులు శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

వాంకిడి, ఫిబ్రవరి 7: మండలంలోని గణేష్‌పూర్‌కు చెందిన చిత్రం భీంరావును కులం పేరుతో దూషించి దాడిచేసినందుకు గాను అదేగ్రామానికి చెందిన షేక్ అబ్దుల్, షేక్ మహబూబ్‌పై అట్రాసిటీ కేసునమోదు చేసినట్లు ఎస్సైసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 4న సాయంత్రం భీంరావు షేక్ అబ్దుల్ చికెన్‌సెంటర్ పక్క నుంచి చేనుకు వెళ్తుండగా షేక్‌అబ్దుల్, షేక్ మహబూబ్ అతన్ని అడ్డగించి రూ.300పాత బాకీ ఇవ్వాలని అడిగారు. నేను తీసుకున్న రూ.300గాక రూ.500అదనంగా మీకు ఎప్పుడో ఇచ్చానని మీకు ఎలాంటి బాకీ లేనని ఆయన చెప్పాడు. దీంతో భీంరావుపై షేక్‌అబ్దుల్, షేక్ మహబూబ్ కర్రతో, కుర్చీతో తలపై దాడిచేసి గాయపర్చడమే కాకుండా గోండోళ్లు ఏం చేస్తారు, గోండోలతో ఏమైతది అంటూ కులం పేరుతో దూషిస్తూ చంపేస్తామని బెదిరించారు. ఈ మేరకు భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ అబ్దుల్, షేక్ మహబూబ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు

దహెగాం, ఫిబ్రవరి 7: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన అక్రమ్‌ఖాన్ అనే వ్యాపారి పత్తికొనుగోలు చేసి తీసుకురమ్మని డ్రైవర్ సయ్యద్‌సమీర్‌కు రూ.1.30 లక్షలు ఇచ్చి వ్యాన్‌తో దహెగాం మండలానికి పంపాడు. దహెగాంకు వెళ్తున్న క్రమంలో బీబ్రాగ్రామ సమీపంలో ఇద్దరువ్యక్తులు అడ్డగించి నగదును తీసుకున్నట్లు అక్రమ్‌ఖాన్‌కు డ్రైవర్‌ఫోన్ ద్వారా తెలిపాడు. నేను వస్తున్నాను అని చెప్పడంతో డ్రైవర్ సయ్యద్‌సమీర్ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశా డని తెలిపాడు. డ్రైవర్‌పైనే అనుమానం ఉందని అక్రమ్ ఖాన్ ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

సడక్‌గూడలో వైద్యశిబిరం

వాంకిడి, ఫిబ్రవరి 7: పీఎం జన్‌ధన్ పథకంలో భాగంగా మండలంలోని కొలాంగూడలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, సిబ్బంది సబీరాబేగం, రాజువర్ధన్,జంగుబాయి, మాజీ సర్పంచ్ అన్నిగ పాల్గొన్నారు.



రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 7: రక్తదానం మరొకరికి ప్రాణదానం చేయడం లాంటిదేనని మందమర్రి జీఎంమనోహర్ అన్నారు. బుధవారం ఎంవీటీసీలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటుచేసిన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇప్పటివరకు ఎంవీటీసీలో 40సార్లకు పైగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశామని తెలిపారు. ఈ ప్రాంతంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ శంకరయ్య, ఏరియా రక్షణాధికారి రవిందర్, గుర్తింపుసంఘం బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యమే లక్ష్యం

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 7: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యమే యాజమాన్య ప్రధాలన లక్ష్యమని కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, మేనేజర్ వీరయ్య అన్నారు. బుధవారం ఏరియాలోని కేకే ఓసీలో బ్లాస్టింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులకు వైద్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట కార్మికుల ఆరోగ్యం కూడా కంపెనీకి ముఖ్యమని, అనారోగ్యం, ప్రమాదాలకు గురైనప్పుడు వీటిద్వారా వారికి ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు.

స్టాండర్డైజేషన్ సమావేశంలో పలు నిర్ణయాలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 7: జేబీసీసీఐ-11, 2వ స్టాండర్డైజేషన్ సమావేశం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో నిర్వహించగా, ఇందులో పలునిర్ణయాలు తీసుకున్నారు. ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు బేసిక్ ఫిట్‌మెంట్, టాక్స్, బకాయిలు బోనస్, రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ ఇచ్చేందుకు అంగీకరించారు. డిపెండెంట్ ఉద్యోగానికి కుటుంబసభ్యులు ఎవరూ లేకుంటే మరణించే వారితో నివసించే సోదరుడు, సోదరి/వితంతువు/కోడలు/అల్లుడు ఉద్యోగానికి అర్హులుగా పరిగణిస్తారు. ఓసీపీలలో పనిచేసే ఉద్యోగు లకు క్యాడర్‌స్కీం పథకం రూపొందించాలని ప్రతిపాదించగా, తదుపరి సమావేశంలో సముచిత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమావేశానికి బీఎంఎస్ నుంచి ఏబీకెఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్ గరిడే, ఏబీకెఎంఎస్ ఉపాధ్యక్షుడు ముజరుల్‌హక్ అన్సారీ, ఎస్‌సీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య హాజరయ్యారు.

గనులపై బాల్క సుమన్ దిష్టిబొమ్మలు దహనం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 7: సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లలో బుధవారం మాజీఎమ్మెల్యే బాల్కసుమన్ దిష్టిబొమ్మలను ఐఎన్‌టీయూసీ నాయకులు దహనం చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ మాట్లాడుతూ బాల్కసుమన్ అహంకారంగా నోరుపారేసుకుంటే ఊరుకునేది లేదన్నారు. ముఖ్యమంత్రికి క్షమాపణలు చెప్పకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, సదయ్య, కృష్ణమోహన్, తిరుపతి, రాజ్‌కుమార్, దేవేందర్, రమేష్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చెన్నూర్ మాజీఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను శ్రీరాంపూర్‌లోని అన్నిగనులపై దహనం చేశారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణచెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తీవ్రపరిణావాలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు జెశంకర్‌రావు, భీంరావు, గిరిగె స్వామి, కలవేన శ్యామ్, రమేష్, అనిల్, సమ్మిరెడ్డి, తిరుపతి రాజు, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ఐఎన్‌టీయూసీ నాయకులు కైరిగూడ, బెల్లంపల్లి వర్క్‌షాప్, గోలేటి సీహెచ్‌పీలలో బుధవారం మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీఎమ్మెల్యే బాల్కసుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏరియా సెక్రెటరీ మాధవకృష్ణ, ప్రభాకర్, రమేష్, వామన్ కుమార్, భాస్కర్, తిరుపతి పాల్గొన్నారు.



కేకే5గనిపై దిష్టిబొమ్మను దహనంచేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 7: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పోరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను కార్మికవర్గం విజవయంతం చేయాలని సీఐటీయూ బ్రాంచికార్యదర్శి ఎస్ వెంకటస్వామి, అల్లిరాజేందర్ తెలిపారు. బుధవారం ఏరియాలోని కేకే5గనిపై కార్మికులను కలిసి కరప త్రాలు పంపిణీ చేశారు.ఈసమ్మెకు దేశవ్యాప్తంగా అసంఘటిత కార్మికులు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. బీఎంఎస్ మినహా అన్ని సంఘాలు సింగరేణిలో సమ్మె విజయవంతానికి పనిచేస్తున్నాయని తెలిపారు.

సింగరేణి సంస్థ పురోభివృద్ధిపై అవగాహన

రెబ్బెన, ఫిబ్రవరి 7: సింగరేణి సంస్థ పురోభివృద్ధిపై బుధవారం సీహెచ్‌పీలో మల్టీ డిపార్టుమెంటు అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వోటుజీఎం మచ్చగిరి నరేందర్ గతంలో సింగరేణి సంస్థ సాధించిన లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్‌బెహేరా, డీజీఎం(ఎఫ్అండ్ఏ) రామారావు, పర్సనల్‌మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

సంస్థ ప్రగతికి పాటుపడాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 7: శ్రీరాంపూర్ ఓసీపీలో బుధవారం మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా జీఎం బి సంజీవరెడ్డి హాజరయ్యారు. నిర్దేశిత ఉత్పత్తిని సాధించి సంస్థ ప్రగతికి పాటుపడాలని ఆయన సూచించారు. రక్షణతోపాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వివిధవిభాగాల అధిపతులు, ఏఐటీయూసి బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పీవో వి పురుషోత్తంరెడ్డి, మేనేజర్ సుధీర్, సహాయపిట్ కార్యదర్శి సత్తయ్య, రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.